



నారాయణ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఫీజులు, పాఠ్యపుస్తకాల పేరుతో ఒత్తిడి


◆ నిబంధనలు పాటించని నారాయణ పాఠశాల
◆ సీజ్ చేసి చర్యలు తీసుకోవాలి ◆ డిడిఇఒకు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే ముందస్తు అడ్మిషన్‌లు నిర్వహిస్తూ, పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్దూ, ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గం బైపాస్‌లో ఉన్న నారాయణ పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా ఉప విద్యా శాఖ అధికారి శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్‌లు చేస్తూ అనేక పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు దండుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో విద్య మాఫియా ప్రారంభించి కొన్ని పాఠశాలలు దోచుకుంటున్నాయని విమర్శించారు. అందులో ప్రధాన పాత్ర నారాయణ విద్యా సంస్థలు వహిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోకుండా ముందస్తు అడ్మిషన్స్ నిర్వహిస్తూ విద్యార్థి తల్లిదండ్రులను కార్పొరేటు ఉచ్చులోకి లాగుతున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పైతరగతికి అనుమతించాలంటే మొత్తం ఫీజులో 50 చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని తల్లిదండ్రులను తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలు ఒక్కో విద్యార్థికి రూ.8 నుంచి రూ.16 వేల వరకు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నిబంధనలను పాటించని నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి భీమేష్, పట్టణ నాయకులు విజయ్, జైవర్ధన్, భూషణ్, నందకిషోర్, తరుణ్, శశి కుమార్ పాల్గొన్నారు.

పంటసాగుకు..
అనువుగా వర్షం..!





◆ ముందుగానే రుతుపవనాల రాక
◆ ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు
◆ వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం
◆ సబ్సిడీ వేరుశనగ కోసం ఎదురుచూపు
◆ తగ్గిన వేసవి తాపం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. సీజన్ ఏదైనా పంట సాగు రైతులకు ప్రధాన వనరు. వర్షం వస్తే అన్నదాతల్లో కళ్లల్లో ఆనందం కన్పిస్తుంది. గత కొన్నేళ్లుగా వర్షం లేక అన్నదాతలు ఆకాశం వైపు చూసేవారు. ఈ ఏడాది మాత్రం ఖరీఫ్‌కు ముందుగానే వర్షం కురుస్తోంది. ముందుగా రుతుపవనాల రాకతో అన్నదాతల్లో ఆనందం కన్పిస్తోంది. ఈ నెల రెండు, మూడవ వారాల్లో వర్షాలు పడ్డాయి. మోస్తరు వర్షాలు పడడంతో పంట సాగు పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రైతులు పొలాల దుక్కులు మొదలు పెట్టారు. ముందస్తు రుతుపవనాల రాకతో వర్షాలు బాగా కురిసి పంటలు చేతికొస్తాయన్న ఆశతో అన్నదాతలో పంట సాగు వైపు అడుగులేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గతేడాది పంట సాగు రైతులను నిరాశ పరిచింది. అనుకున్న సమయంలో వర్షాలు రాకపోవడంతో ఖరీఫ పంట చేతికందకుండా పోయింది. పెట్టుబడులు కూడా చేతికందలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో కరువు ఛాయలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ప్రస్తుత సీజన్‌లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయి. మే రెండవ వారం నుంచి మోస్తరు వర్షాలు పడడంతో భూమి తడిసి కాస్త పదును అయ్యింది. ఈ పరిస్థితుల్లో రైతులు పొలాల్లో వేసవి దుక్కులు చేసుకుంటున్నారు. ముందస్తు నైరుతి రుతపవనాల రాకతో రానున్న రెండు వారాలు వర్షాలు బాగానే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేస్తుండడంతో రైతులు ప్రధాన పంట వేరుశగన సాగుపై నిమగ్నం అయ్యారు. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట అనంతపురం జిల్లా 4.90 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో 4.35 లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూపు

ఖరీఫ్ సాగునకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తుంది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు సబ్సిడీపై పంపిణీ చేసే విత్తన వేరుశనగ, ఇతర అంతర్ పంటల విత్తనాల ధరలను ఖరారు చేశారు. అయితే పంపిణీ తేదీ ఇంకా ఖరారు అవలేదు. దీంతో రైతులు ప్రయివేటు వ్యాపారుల వద్ద వేరుశనగ విత్తనాలను కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. బయట మార్కెట్లో విత్తన ధరలు ఎక్కువగా ఉండడం రైతులకు కష్టంగా మారుతోంది. సబ్సిడీతో అవసరమైన మేర విత్తనాలు అందజేస్తే ఉపయోగంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

తగ్గిన వేసవి తాపం

ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వారం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. మార్చి, ఏప్రిల్‌లో ఎండలు ఠారెత్తించాయి. ఎండ వేడమికి జనాలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకే భయపడ్డారు. ఎండలు ఏప్రిల్ నెల పూర్తిగా, మే మొదటి వారం ఉంటాయని అందరూ భావించారు. అయితే ఏప్రిల్ చివరి వారం, మే నెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి. గాలీవానతో కూడిన మోస్తరు వర్షాలు కురిశాయి. అకాల వర్షానికి తోడు రుతుపవనాలు ముందుగా రావడంతో వేసవి కాలం కాస్త ముందుగానే ముగిసినట్లు అయ్యింది. ప్రస్తుతం రుతుపవనాల రాకతో ఎండపోటు తగ్గింది. గత రెండు రోజులుగా మేఘాలు వర్షామృతం అయ్యి ఉండడంతో జనం ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు.

త్వరితగతిన అమృత్ 2.0 పనులు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అమృత్ 2.0 కింద మున్సిపాల్టీల్లో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అమత్ 2.0పై జిల్లాస్థాయి అడ్వైయిజరీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, తదితర మున్సిపాలిటీలలో అమత్ 2.0 కింద చేపట్టిన పనులను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ శాఖ పరిధిలో హైబ్రిడ్ అన్యునిటీ మోడ్లో చేపట్టే పనుల పూర్తిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్, సర్వేపై అధికారులు దృష్టి సారించాలని, డ్రైవ్ మోడ్‌లో చేపట్టాలని, ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ ఆదినారాయణ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, నగర పాలక సంస్థ ఎస్ఈ చంద్రశేఖర్, హార్టికల్చర్ ఏడీ ఫిరోజ్ ఖాన్, పబ్లిక్ హెల్త్ డిఈలు కేతన్ కుమార్ రెడ్డి, జ్యోతి, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్‌లో జిల్లా టాప్-3లో ఉండాలి

యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్‌లో జిల్లా టాప్-3లో ఉండాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌పై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో క్షేత్రస్థాయి అధికారులు అందరిచేత యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్ చేయించాలన్నారు. గంటకు 5 వేల రిజిస్ట్రేషన్స్ చేయించేలా లక్ష్యం నిర్ధేశించుకోవాలన్నారు. జిల్లాలోని విద్యాశాఖ పరిధిలో ఉపాధ్యాయులు, పిల్లలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆయా శాఖల మండల అధికారులు రిజిస్ట్రేషన్స్ విస్తతస్థాయిలో చేయించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఒ ఎ.మాలోల, ఆయా శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

ఎండియు వాహనదారుల
తొలగింపు అన్యాయం: ఐద్వా, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజలకు నిత్యావసర సరుకులు ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్న ఎండియు వాహనదారులను తొలగించడం అన్యాయంగా ఉందని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కసాపురం రమేష్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా గత ప్రభుత్వం ఎండియు వాహన దారుల ద్వారా ప్రజల ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అందించిందన్నారు. దీని వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి లభించిందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 405 ఎండియు వాహనాలు సేవలు అందిస్తున్నాయని, వీటి మీద ఆధారపడిన నిరుద్యోగులు 800 మంది పైగా ఉన్నారని తెలిపారు. వాహనాలను తొలగిస్తే వారంతా ఉపాధికి దూరం అవుతారన్నారు. ప్రభుత్వం స్పందించి ఎండియు వాహనాలతో పాటు, రేషన్ షాపుల వద్ద సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్వహణలో లోపాలను సరిదిద్ది పౌరసరఫరాల వ్యవస్థను మరింత మెరుగుపరచాలని తెలియజేశారు. రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు కందిపప్పు, నూనె, చింతపండును ప్రజలకు అందించాలన్నారు. చేయాలన్నారు.

సాంకేతిక రంగంతో దేశపురోభివృద్ధి

జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు



నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైస్‌ఛాన్సలర్ సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

దేశాభివృద్ధిలో సాంకేతిక రంగం పాత్ర ఎంతో కీలకం అని జెఎన్‌టియు విసి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శనరావు తెలిపారు. మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమాన్ని జెఎన్‌టియు పరిపాలన భవనంలో మంగళవారం నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి విసితో పాటు ఓస్డ్ టు వీసీ ఆచార్య ఎన్.దేవన్న, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య, యూనివర్సిటీ ఉన్నతాధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విసి సుదర్శన రావు మాట్లాడుతూ సాంకేతిక రంగం అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రు గుర్తించారన్నారు. ఆ దిశగా ఆయన సాంకేతిక రంగం అభివృద్ధికి తోడ్పాటు అందించారని చెప్పారు. విద్యార్థులు పరిశోధనాత్మకంగా ఆలోచించినప్పుడు నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నా రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత విద్య, వ్యవసాయం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన పురోభివద్ధి సాధించడంలో బలమైన పునాదులను నిర్మించడంలో జవహర్ లాల్ నెహ్రూ కృషి మరువలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, ఎస్‌వి.సత్యనారాయణ, వైశాలి ఘోర్పడే, పి.సుజాత, జి.ప్రశాంతి, పద్మ సువర్ణ, ఆర్.కిరణ్మయి, నాగప్రసాద్ నాయుడు, బి.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇగా పురార్ధనరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తుంగభద్ర హైలెవెల్ కెనాల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పురార్ధనరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ తుంగభద్ర కెనాల్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నగర అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, తదితరుల పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్‌ఇకి బొకే అందజేస్తున్న సిబ్బంది

మహానాడులో అనంత నేతలు





ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రి పయ్యావుల కేశవ్

మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి, అమిలినేని, బండారు శ్రావణిశ్రీ, ఎంపీ పార్థసారధి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

కడప వేదికగా జరుగుతున్న టిడిపి మహానాడులో ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు పాలుపంచుకున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన టిడిపి ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు మహానాడులో పాల్గొని సందడి చేశారు. మహానాడులో సభ్యత్వ కార్డులను నమోదు చేసుకున్నారు. పార్టీ అధిష్టానం సూచించిన బాధ్యతలను నాయకులు నిర్వర్తించారు. బుధ, గురువారాల్లో జరిగే మహానాడు కార్యక్రమాల్లో నాయకులు పాల్గొననున్నారు.

కొనసాగిన ప్రజాపోరు యాత్ర

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరుయాత్ర మంగళవారం రెండవ రోజుకు చేరింది. పట్టణంలోని 26వ వార్డులోని నాగసముద్రం బావి వీధి, హౌసింగ్ బోర్డు, సాయిబాబు గుడి, భీమలింగస్వామి గుడి, రామిరెడ్డి కాలనీ, సిఐటియు కాలనీ పలు ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా చిన్నపాటి వర్షానికే రోడ్డు, ఇళ్లల్లోకి వర్షం నీటితోపాటు మురుగునీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా కాలనీల్లో రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పారిశుధ్య లోపంతో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి దోమల బెడద ఎక్కువైందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి జూలై 2వతేదీన మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, శాఖ కార్యదర్శులు ఈరన్న, నాగరాజు, సరస్వతి, పూర్ణిమ, వన్నూరమ్మ, అజీజ్, వెంకటలక్ష్మి, మమత, సుంకమ్మ, బీబీ, సురేష్, కమల్ బహదూర్, మున్నా, ప్రభాస్, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.



పోరుయాత్రలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఆర్డీటీ పరిరక్షణకు సంపూర్ణ మద్దతు

మాజీమంత్రి ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) పరిరక్షణకు సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. ఆర్డీటీ పరిరక్షణకు త్వరలో మాజీ ఎంపి తలారి రంగయ్య చేపట్టనున్న పాదయాత్రకు మద్దతు తెలపాలని వైసిపి నాయకులు మంగళవారం రఘువీరారెడ్డిని కలిసి కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఆర్డీటీ కోసం తలారి రంగయ్యతో కలిసి పాదయాత్రలో అడుగు వేయనున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆర్డీటీ పరిరక్షణ కోసం ఆర్డీటీ ఎనలేని సేవలు చేస్తోందన్నారు. ముఖ్యంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కావున ఆర్డీటీకి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. రఘువీరాను కలిసిన వారిలో మడకశిర వైసిపి ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప, యువ నాయకులు రామాంజనేయులు, తాలూకా విభాగం కమిటీ అధ్యక్షులు పాత లింగప్ప, కళ్యాణదుర్గం వైస్ కన్వీనర్ మల్లాపురం మల్లికార్జున, ముప్పులకుంట జానీ, తదితరులు పాల్గొన్నారు.



రఘువీరారెడ్డితో వైసిపి నాయకులు

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోండి


ఎఎస్పీ రోహిత్‌కుమార్-చౌదరి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

సమస్యలు ఏమైనా సారస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప.. గొడవలకు వెళ్తే ఎవరికీ లాభం ఉండదని ఎఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ భూ సమస్యలను రెవెన్యూ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. లేకపోతే పోలీసులు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తీర్చుకోవాలన్నారు. లేకపోతే ఆర్డీవో ద్వారా, లేకపోతే కోర్టుకు వెళ్లి అయినా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అలాకాకుండా గొడవలకు పాల్పడితే మీతోపాటు కుటుంబ కూడా సమస్యల ఊబిలో చిక్కుకుంటుందే తప్ప సమస్య పరిష్కారం కాదన్నారు. అనంతరం మండల కేంద్రం లోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఎంఆర్‌పిఎస్, జైభీమ్ భారత్ పార్టీ, సిపిఐ నాయకులు ఎఎస్పీ, రెవెన్యూ అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగేంద్రప్రసాద్, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, అధికారులు



పాతపేర్లతో దర్శనమిస్తున్న బోర్డు

మారని బోర్డు..!

తహశీల్దార్ కార్యాలయంలో పాతపేర్లు

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న సమాచార హక్కు చట్టం బోర్డును మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఎందోకంటే ఎన్నో నెలల క్రితం పని చేసిని అధికారుల పేర్లే బోర్డులో దర్శనం ఇస్తుండటంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సందర్భంగా పని చేసిన తహశీల్దార్ రామాంజనమ్మ బదిలీపై వెళ్లారు. అయితే ఆమె పేరు ఇప్పటికీ బోర్డులో దర్శనం ఇస్తుండటం గమనార్హం. ప్రస్తుతం మునివేలు తహశీల్దార్‌గా పని చేస్తున్నారు. అలాగే ఆర్‌డిఒ కూడా మారారు. అయితే పాతపేర్లే దర్శనం ఇస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బోర్డులో ఉన్న పాతపేర్లు తీసివేసి ప్రస్తుతం పని చేస్తున్న అధికారుల పేర్లు రాయాలని ప్రజలు కోరుతున్నారు

'నవోదయ'కు భూమిని గుర్తించండి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

జవహర్‌లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయం కోసం అవసరమైన భూమిని గుర్తించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కళ్యాణదుర్గం పరిధిలో జవహర్ లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయం కోసం అవసరమైన భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయం కోసం 30 ఎకరాల భూమి కావాల్సి ఉండగా పట్టణంలోని ధర్మవరం రోడ్డులో ఉన్న సర్వే నెంబర్ 464లో ఉన్న 17.12 ఎకరాలు, సర్వే నంబర్ 465లో ఉన్న 1.35 ఎకరాల భూమిని పరిశీలించారు. ప్రభుత్వ భూమి ఉంటే గుర్తించాలని ఆర్డీఓని ఆదేశించారు. అనంతరం కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయాన్ని జిల్లా సందర్శించి ఆర్డీఓ, సర్వే అధికారులతో సమావేశం నిర్వహించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం కళ్యాణదుర్గం మండలంలోని ఈస్ట్ కోడిపల్లి గ్రామం వద్దనున్న సర్వేనెంబర్ 389 లో ఉన్న 37.45 ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రైతాంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

తక్షణం బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలి - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజాప్రతినిధులు తమ స్వార్థం, స్వప్రయోజనాలను వీడి ఉమ్మడి జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నైరుతీ రుతుపవనాలు ఇప్పటికే కేరళ తీరాన్ని తాకాయన్నారు. మరో ఐదారు రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందన్నారు. అయినా ప్రభుత్వం విత్తన కేటాయింపులు, సరఫరా విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 15 లక్షల ఎకరాలకు పైబడి అన్ని పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. ఇందుకోసం 3.11 లక్షల క్వింటాళ్ల విత్తనం అవసరమని ప్రతిపాదనలు పంపితే కేవలం 1.14 లక్షల క్వింటాళ్లు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. గత ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు నష్టపోయాయని, ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికంగానే పంటలు సాగు అవుతాయన్నారు. ఓ వైపు రైతులు పంట సాగు సన్నాహకాల్లో ఉన్నా ఇప్పటి వరకు వేరుశనగ, కంది, ఆముదం, మొక్కజొన్న, పత్తి తదితర విత్తనాలు సరఫరా కాలేదన్నారు. గత రబీలో నాణ్యమైన విత్తనాలు వచ్చినా వాటిని కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోలేదన్నారు. రబీలో సాగు చేసిన వేరుశనగ అంతా ఇతర జిల్లాలకు తరలిపోయిందన్నారు. సాగుకు తగ్గట్టుగా విత్తనాలు అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం విఫలమవుతోందని తెలిపారు. 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనం సరఫరా చేస్తామని చెబుతున్నారని, ఈనెలాఖరులోగా అన్ని రకాల విత్తనాల పంపిణీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు పెద్ద ఎత్తున నష్టపోయే అవకాశం ఉందన్నారు. మరోవైపు ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు అందిస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక కేంద్రం వాటాతో కలిపి రూ.20 వేలు ఇస్తామని అంటున్నారన్నారు. బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఒక్క సమీక్ష అయినా జరిపారా? అంటూ ప్రజాప్రతినిధులపై మండిపడ్డారు. రైతుల కష్టాలను ఇప్పటికే ప్రతిపక్షాలు, రైతు సంఘాలు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాయని.. పత్రికల్లో కూడా అనేక కథనాలు వస్తున్నట్లు చెప్పారు. మరోవైపు అధిక ధరలకు ఎరువుల అమ్మకాలు సాగుతున్నాయన్నారు. ఇవన్నీ పట్టించుకోని ప్రజాప్రతినిధులు కేవలం వారి ఆదాయం, వ్యాపారాలపైనే దృష్టి సారించారని విమర్శించారు. కనీసం కడపలో జరుగుతున్న మహానాడులో అయినా సీఎం, వ్యవసాయశాఖ మంత్రితో చర్చించి ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగం కష్టాలు తీర్చే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'మా ఇంటికి స్మార్ట్‌మీటర్ వద్దు'

సిపిఎం ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

'మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు' అనే పోస్టర్‌ను సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సావిత్రమ్మ మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల బిగించొద్దన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలు కట్టలేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కరెంట్ ఛార్జీలను తగ్గించాలన్నారు. అలాగే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, జయమ్మ, రాజేశ్వరమ్మ, సరస్వతి, రాము, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణపై అవగాహన

యాడికి : జాతీయ అంధత్వ నివారణ పథకంలో భాగంగా తాడిపత్రి డివిజన్ ప్రభుత్వ నేత్ర వైద్యాధికారి మధుసూదనరాజు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల్లో అంధత్వ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుసూదనరాజు దృష్టి లోపాల నుంచి కళ్లను కాపాడటం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి వివరించారు.

కూతలేరు వంకలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి వెబ్ న్యూస్‌కు స్పందన



చెత్తను తొలగిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-నార్పల

చెత్తాచెదారంతోపాటు కంపచెట్లతో నిండిన మండల కేంద్రంలోని కూతలేరు వంకలో పంచాయతీ అధికారులు శుభ్రం చేశారు. 'చెత్తాచెదారం, కంపచెట్లతో నిండిన కూతలేరు వంక' అని ప్రజాశక్తి వెబ్‌లో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా వంకలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించారు. సమస్య తెలిసిన గంటల వ్యవధిలోనే స్పందించి శుభ్రం చేయించిన పంచాయతీ అధికారులు, సిబ్బందికి స్థానికులు అభినందనలు తెలిపారు.

యుద్ధంలో పాల్గొన్న జవాన్‌కు సన్మానం



జవాన్ రమాకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న జర్నలిస్టులు

తాడిపత్రి : ఆపరేషన్ సింధూర్ యుద్ధంలో పాల్గొన్న జవాన్ రమాకాంత్‌రెడ్డిని తాడిపత్రి జర్నలిస్టులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సింధూర్ యుద్ధం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జవాన్ రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 2000లో తాను ఆర్మీలో చేరినప్పటి నుంచి పశ్చిమబెంగాల్, జమ్మూకాశ్మీర్, తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. అయితే 24 ఏళ్ల విధి నిర్వహణలో ఆపరేషన్ సింధూర్ ఒక అమూల్యమైన ఘట్టమన్నారు. దేశం కోసం సేవలను అందించడానికి అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో విలేకర్లు ప్రజాశక్తి వెంకట్రామిరెడ్డి, ఆది, కన్నా, పుల్లయ్య, వినోద్, సిద్ధయ్య, నరేంద్ర, పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

తప్పుల తడకగా చేపట్టిన భూసర్వే కారణంగా నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో తహశీల్దార్‌ను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే కారణంగా మండలంలోని అనేక గ్రామాల్లో భూముల సరిహద్దులను మార్చారన్నారు. అయితే అందరికీ సమానంగా హద్దులు చూపకుండా పలుకుబడి ఉన్న వారికి అనుకూలంగా మారుస్తూ చాలామంది రైతులకు అన్యాయం చేశారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే రీసర్వేను రద్దు చేసి పాత పద్ధతిలోనే పాసు పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కూడా రీ సర్వేకే మొగ్గు చూపడం బాధాకరమన్నారు. రీ సర్వే చేసిన గ్రామాల్లో అనేక సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఈ విషయమై మండల అధికారుల వద్దకు వెళ్లి అడిగితే తమకు తెలియదని సమాధానం ఇస్తున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి రీ సర్వే గ్రామాల్లో రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ఐసిడిఎస్ పీడీ నాగమణి



నార్పలలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఐసిడిఎస్ పీడీ, తదితరులు

ప్రజాశక్తి-నార్పల

బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ పీడీ నాగమణి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని చింతవనం అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో కిషోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు పౌష్టికాహారంతోపాటు శారీరక సౌష్టవంతోనే మానసిక ఆరోగ్యం సాధ్యమన్నారు. ఆడపిల్ల చదువు అవనికి వెలుగు అన్నారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చెప్పినట్లు జీవితకాలం ఏదో ఒక విషయం తెలుసుకుంటూ ఉండాలన్నారు. సమాజంలో ఆడపిల్లలపై ఆంక్షలు అధికంగా ఉన్నాయని, అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. వాటన్నింటినీ ఎదుర్కొని ధైర్యంతో ఆడపిల్లలు ముందుకు సాగాలన్నారు. సిడిపిఒ భారతి బాలల చట్టాలు, పోక్సో చట్టంపై వివరించారు. అనంతరం బాలికలతో బాల్యవివాహాల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆడపిల్లలు ముఖ్యంగా కిశోర బాలికలు ఆకుకూరలు, గుడ్లు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ అక్కులప్ప, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సునాలిని, మధుమాలిని, రాజామణి, శాంతమ్మ, లావణ్య, అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి, భారతి, జరీనాబేగం, రామాంజనమ్మ, నాగమణి, కిషోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : 11 నుంచి 18ఏళ్ల వయస్సు ఉన్న కిశోర బాలికల్లో శారీరక, మానసిక ధైర్యాన్ని నింపేందుకే కిషోర వికాసం నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పోలేపల్లి అంగన్వాడీ కేంద్రంలో కిషోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ తిమ్మరాజు, కానిస్టేబుల్ గుడిదప్ప, అంగన్వాడీలు రేణుక, అనిత, సంతోషమ్మ, ఎఎన్ఎం మహాలక్ష్మి, ఆయాలు శిల్ప, గౌరమ్మ, ఆశావర్కర్లు హనుమక్క, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ఉరవకొండ : కిషోర వికాసం కార్యక్రమం బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని చాబాల సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హెచ్.పద్మ, ఎంఎస్‌కె అరుణ, టీచర్ సోమేశ్వరి, సిబ్బంది నాగమ్మ, రాజేశ్వరి, ప్రభావతి, కిషోర బాలికలు సాయిపల్లవి, మహేశ్వరి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోటను సందర్శించిన అధికారులు

గుత్తి : చారిత్రాత్మకమైన గుత్తి కోటను మంగళవారం అధికారులు సందర్శించారు. జూన్ 2న జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుత్తి కోటలో యోగా కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గుంతకల్ రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, తహశీల్దార్ డి.ఓబులేసు, మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, ఎంపిడిఒ డి.ప్రభాకర్‌నాయక్ కలిసి కోటలోని గుర్రపుశాల వద్ద నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా సర్ థామస్ మన్రో సమాధిని సందర్శించారు. సమాధి వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, డిఇఇ హేమచంద్ర, ఎఇ హరికిరణ్, యోగా గురువు కృష్ణ, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, కోటగైడ్ మంగే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో వాహనాల వేలం

గుత్తి : పోలీస్ స్టేషన్లో మంగళవారం ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి ఆధారాలు లేనివి అనుమానస్పదంగా వదిలేసిన 17 ద్విచక్ర వాహనాలకు తహసిల్దార్ డి. ఓబులేసు, ఎస్సై కె.సురేష్ సమక్షంలో వేలంపాట జరిగింది. గుత్తి పట్టణానికి చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తి వేలంపాట పాడి రూ.90,500, జీఎస్టీ రూ.16,290తో వాహనాలను దక్కించుకున్నాడు.

ప్రజాసేవలోనే సంతృప్తి : ఎంపిడిఒ



ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ఎంతటి భూస్వామి అయినా ప్రజాసేవలోనే సంతృప్తి ఉంటుందని ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరి తెలిపారు. పదవీ విరమణ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన ఆయన మాట్లాడుతూ చదువుకునే రోజుల్లో కమ్యూనిస్టు పార్టీల ఉద్యమాలకు ఆకర్షితుడై డాక్టర్ కావాలన్న లక్ష్యాన్ని వదులుకుని ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ విద్యార్థుల సమస్యలపై ఎనలేని పోరాటం చేశారన్నారు. 1998లో కర్నూలు జిల్లా అవుకు జెడ్పీ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ సాధించినట్లు తెలిపారు. అక్కడి నుంచి 1995లో నందికొట్కూరులో సీనియర్ అసిస్టెంట్‌గా, 2014లో అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలో ఇఒఆర్‌డి, 2023 నుంచి ఎంపిడిఒగా ముదిగుబ్బ, కదిరి, గుంతకల్లు మండలాల్లో పని చేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంతో ఆనందం ఉంటుందని తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే రైతుకు నష్టం

ప్రజాశక్తి-ఉరవకొండ :

హంద్రీనీవా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నష్టపోయిన రైతు శ్రీనివాసులుకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన రైతు పి.శ్రీనివాసులు సాగు చేసిన ఐదెకరాల వేరుశెనగ పంటను కాలువకు గండి కొట్టి నష్ట పరచడం బాధాకరమన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే రైతు నష్టపోయాడన్నారు. ఈ ఘటనతో రైతుకు దాదాపు రూ.3లక్షలకుపైగా నష్టం వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఎంపిపి నరసింహులు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు మోపిడి సిద్ధప్ప, రైతుసంఘం నాయకులు బోయ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జంగం శ్రీనివాసులు కళా బృందం మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ అన్న క్యాంటీన్ వద్ద వీధి నాటకం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వచ్చిన వారికి ఎఆర్‌టి సేవలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలిసి జీవించాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ రాధ, ఐసిటిసి విభాగం కౌన్సిలర్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ అల్తాఫ్, మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠ, అకౌంటెంట్ లోకేష్, ఎఎన్ఎం నాగమణి, ఏరియా ఆసుపత్రి జనరల్ కౌన్సిలర్ నాగరాజు, సచివాలయ ఎఎన్ఎంలు జయలక్ష్మి, ప్రమీల, సరోజ, అరుణ, సునీత, రేణుక, శాంతా, రామాంజినమ్మ, సిఎస్ఎఒ శివన్న, ఆర్‌డిటి ఔట్రేచ్ వర్కర్ అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడు కాదు.. దగానాడు..

మాజీ మంత్రి శైలజానాథ్

ప్రజాశక్తి-అనంతపురం

వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావును కన్నీళ్లు పెట్టించి గద్దె దింపి టిడిపి నాయకులు చేసుకుంటోంది మహానాడు కార్యక్రమం కాదని, దగానాడు అని మాజీ మంత్రి శైలజానాథ్ విమర్శించారు. మంగలవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్‌టిఆర్ వారసుడు కాదనే విషయాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తించాలన్నారు. ఎన్‌టిఆర్‌కు ఒక వారసుడు దబిడి దిబిడి అయితే.. మరో వారసురాలు బిజెపి అధ్యక్షురాలుగా ఉందని ఎద్దేవా చేశారు. మరో వారసుడు జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు పరిమితమయ్యారన్నారు. రాష్ట్రానికి ఏమేమి తీసుకొచ్చారో మహానాడులో ప్రకటించాలని సూచించారు. గంజాయి తాగారని దళితులను దారుణంగా మానవహక్కులు హరించేలా కొట్టారని మండిపడ్డారు. సవాళ్లు, ప్రతి సవాళ్లు రాష్ట్ర అభివృద్ధికి పాటు పడేలా ఉండాలన్నారు. హంద్రీనీవా 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో పూర్తి చేసి జిల్లాలో చెరువులన్నీ నింపాలని డిమాండ్ చేశారు.

నేడు ఎన్టీఆర్ సినీ సంగీత గానలహరి

అనంతపురం కలెక్టరేట్ : పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 102 వర్ధంతి సందర్భంగా బుధవారం నాడు ఎన్టీఆర్ సినీ సంగీత గానలహరి నిర్వహిస్తున్నట్లు పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుగుమంచి సురేష్‌బాబు, వి.మారుతి ప్రసాద్ నాయుడు తెలిపారు. అనంతపురం క్లబ్ ఆవరణంలో బుదవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఎన్టీఆర్ సినీ సంగీత గానలహరి కార్యక్రమానికి సినీ, సంగీత అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం : ఐద్వా

అనంతపురం కలెక్టరేట్ : సమాజంలో గొప్ప సంస్కరణలకు ఆజ్యం పోసిన సామాజిక సంస్కర్త, రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు అని ఐద్వా నేతలు కొనియాడారు. కందుకూరి వీరేశలింగం పంతులు 106 వర్ధంతి కార్యక్రమాన్ని ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం నాడు అనంతపురం మల్లుస్వరాజ్యం కాలనీలో నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు చంద్రిక, అశ్విని హాజరై మాట్లాడారు. కందుకూరి వీరేశలింగం పంతులు బాలికల విద్యకు శ్రీకారం చుట్టారన్నారు. బాల్యవివాహాలను వ్యతిరేకిస్తూ, వితంతు వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు. నేటి సమాజంలో అసమానాతలను రూపుమాపేందుకు కందుకూరి స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర నాయకురాలు శంషాద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ జయంతి : డిఆర్ఒ

అనంతపురం కలెక్టరేట్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని ప్రతి ఏడాది రాష్ట్ర పండుగగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అనంతపురం డిఆర్ఒ ఎ.మలోల మంగళవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను కలెక్టరేట్ రెవెన్యూ భవన్లో బుధవారం ఉదయం 10-30 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాలుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

గుంతకల్లు : స్థానిక రైల్వేస్టేషన్‌లోని 7వ నెంబర్ ప్లాట్‌ఫారంపై పెచ్చులు పడి మృతిచెందిన కర్నూలు వాసి మణికంఠ కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బి.గోవిందు, వీరభద్రస్వామి, బి.మహేష్, గోపీనాథ్, ఎస్ఎండి గౌస్, రాముర,యల్, రామాంజనేయులు, ఎఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి రూ.50లక్షలు విరాళం

కళ్యాణదుర్గం రూరల్ : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎస్ఆర్‌సి ఇన్‌ఫ్రా డెవలప్పర్స్ తరుపున తెలుగుదేశం పార్టీకి రూ.50లక్షలు విరాళం అందజేశారు. ఈమేరకు మంగళవారం కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో సంబంధిత మొత్తానికి సంబంధించిన చెక్కును సిఎం చంద్రబాబుకు అందజేశారు.


ఉద్యోగోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

అనంతపురం కలెక్టరేట్ : సాధారణ ఉద్యోగోన్నతులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయకుల పదోన్నతుల్లో షెడ్యూల్డ్ క్యాస్టుల ఉప వర్గీకరణ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుగుమంచి సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అహోబిలేసు డిమాండ్ చేశారు. మంగళవారం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం జారీ చేసి మెగా డీఎస్సీలో కూడా ఎస్సీల ఉప వర్గీకరణ అమలు చేయాలన్నారు. ఉద్యోగుల పదోన్నతుల్లోనూ అమలు చేయాలని కోరారు.

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల ప్లేస్‌మెంట్ ప్రక్రియ

అనంతపురం : వైద్య, ఆరోగ్య శాఖలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగా (మగ ఆరోగ్య కార్యకర్తలు) పని చేస్తున్న వారికి ప్రశాంతంగా కౌన్సిలింగ్ నిర్వహించినట్లు డిఎంహెచ్ఒ ఇబి దేవి తెలిపారు. సీనియారిటీ ప్రాతిపదికన 215 మంది హెల్త్ అసిస్టెంట్లు ఇచ్చుకున్న ఆప్షన్ ప్రకారం ప్లేస్‌మెంట్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్‌రావు, మలేరియా అధికారి ఓబులు, కార్యాలయ పర్యవేక్షణ అధికారులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్లు పవన్‌కుమార్, సురేష్, కమలాకర్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి



బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని ఎరిడికెర ఎంపిపిఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు షబాన కౌసర్ (35) అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు పవన్‌కుమార్, మండల విద్యాధికారి ఓబుళపతి, తదితరులు సంతాపం తెలిపారు.

1వ తేదీ నుంచి రేషన్ పంపిణీ

రాప్తాడు : ప్రతినెలా 1 నుంచి 15వతేదీ వరకూ రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ విజయకుమారి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు ప్రతినెలా 1 నుంచి 15వతేదీ వరకూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకూ కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ యోగాను అలవర్చుకోవాలి

'యోగాంధ్ర'లో డిఎంహెచ్ఒ ఇబి దేవి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో తప్పనిసరిగా యోగాను అలవర్చుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, యోగా నోడల్ అధికారిణి డాక్టర్ ఇబి దేవి సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన 'యోగాంధ్ర' మాసోత్సవంలో చేపట్టిన అవగాహన ర్యాలీని మంగళవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ మీదుగా తిరిగి ఆర్ట్స్ కళాశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21 నుంచి జూన్ 21వతేదీ వరకూ అంతర్జాతీయ యోగా మాసోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా యోగా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా చేయడం ద్వారా పలు రోగాలు దరిచేరవన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ రామ్‌కుమార్ , డాక్టర్ లల్యానాయిక్, ఎన్‌సిడి నారాయణస్వామి, యోగా మాస్టర్లు గురురాజరావు, కృష్ణవేణి, చలపతి, డిపిఆర్ఒ గురుస్వామిశెట్టి, డెమో త్యాగరాజ్, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, కిరణ్, జిల్లా స్పోర్ట్స్ అధికారి అనిల్, డాక్టర్ మురళీకృష్ణ, శ్రీనాథ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఐసిడిఎస్ శ్రీదేవి, వివేకానంద యోగా కేంద్రం దివాకర్, ఆంజనేయులు, రాజశేఖర్, బ్రహ్మకుమారీలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్, వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు సామూహిక యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు, ఎంపిడిఒ విజయభాస్కర్, ఎంఇఒ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ అధ్యక్షతన మంగళవారం యోగేంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్యాలయం ముందు యోగాసనాలు వేశారు. అనంతరం ర్యాలీగా బస్టాండ్ సర్కిల్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడి యోగాపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీదేవి, సచివాలయ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో పలువురు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శకుంతలమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగంగా యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చేనెల 21వ తేదీ వరకు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలాజీరాజ్, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఇఒఆర్‌డి సురేష్‌బాబు, ఎంఇఒ ఓబుళపతి, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు

శింగనమల : యోగాతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్ సూచించారు. యోగాంధ్ర-2025లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని తరిమెలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయడం అలవాటు చేసుకుంటే చాలా రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవి, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గుత్తి : యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ గుత్తిలో మంగళవారం మున్సిపల్ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ కూడలి మీదుగా రాజీవ్ గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా మాట్లాడుతూ జూన్ 2వ తేదీన గుత్తి కోటలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యోగ గురువులు ద్వారా శిక్షణ కార్యక్రమాలు చేపట్టమన్నారు. కోటలో జరిగే యోగా దినోత్సవానికి ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన హనుమంతురాయుడు

బెలుగుప్ప : ద్విచక్ర వాహనం అదుపుతప్పి హనుమంతురాయుడు (34) మృతిచెందిన ఘటన మండల పరిధిలోని అంకంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అంకంపల్లి గ్రామానికి చెందిన హనుమంతురాయుడు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి ఊరికి సమీపంలో ఉన్న కిరాణాకొట్టులో సరుకులు తీసుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్దకు రాగానే ద్విచక్రాహనం అదుపుతప్పి మురికి కాలువలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. గమణించిన స్థానికులు బంధువులకు సమాచారం అందించడంతో భార్య లక్ష్మీదేవి, కుటుంబ సభ్యులు వచ్చి బోరున విలపించారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు బెలుగుప్ప ఎస్ఐ శివ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.